కథానిక

లోకం పోకడ

"వల్లపురెడ్డి"

మా వారు పొలాలవైపు వెళ్ళి ఉండటం మూలాన ఉదయం ఎనిమిది గంటలకు ఇంట్లోకి అవసరమైన వెచ్చం కొనుక్కురావడానికై దుకాణానికి వెడుతూన్న దాన్నల్లా, మా పొరుగింటి ముందర ఇద్దరు వ్యక్తులకి జరుగుతూన్న కలహాన్ని చూసి ఆగాను. ఆ ఇరువురిలో ఒకడు ఆ ఇంటి జీతగాడు; మరొకడు మా ఇంటికి చేరువనే ఉన్న ఒక చిన్న వ్యవసాయ దారుడు. వాణ్ణి అందరూ బీరడని పిలుస్తారు.

బీరడిని మా ఇంటికి చేరువన ఉండే ఒక చిన్న వ్యవసాయ దారుడని నిర్వచించడం మాత్రమే ఇక్కడ సరిపోదు. కొంచెం వివరించాల్సి ఉంది.

నేటికి మూడు వర్షాకాలాల క్రిందటివరకు బీరడితో పేచీపడటానికి మా ఊళ్ళోగాని, మా ఊరికి సమీప ప్రాంతాల్లో ఉన్న ఇతర ఊళ్ళల్లో గాని ఎవడికీ గుండెలులేవు. వయసు నల్భైకి సమీపిస్తున్నా ఆరడుగుల ఎత్తుగల వాడినల్లని ఆకారం, మెలికలు తిరిగిన కండరాలూ, కోరమీసం చూస్తే, చాలాకష్టంగా ఇరవై అయిదేళ్ళుంటాయన్నట్లు స్పష్టపడేది. అప్పటికి ఒక పది సంవత్సరాల వెనకటిమాట. మా ఊళ్ళో వల్లారెడ్డి అని ఒక మంత్ర తంత్రాలు నేర్చిన వ్యక్తి ఉండేవాడు. ఆనాడతని దౌర్జన్యానికి గ్రామప్రజలంతా లోనయ్యారు. ఎవరేనా అతనికి విరుద్ధంగా ఏ కించిత్ విషయంలో నాల్క కదిపినా సరే, వాడి నాశనాన్ని చూసి వదిలేవాడు. ఊళ్లో అందమైన స్త్రీ లుండటం కూడా కష్టమైపోయింది. అతడు తను నేర్చిన చేతబడులద్వారా ప్రతివ్యక్తినీ తన చేతి కీలుబొమ్మలా ఆడించేశాడు. ప్రజల్లో సహనశక్తి నశించి పోయింది. ఎట్లాగైనా ఆ దుష్టుణ్ణి తమ కళ్ళ ముందునుంచి తొలగించే ఉపాయం చూడాలను కున్నారు. అందరిలోనూ పిల్లి మెడలో గంటకట్టే వంతు ఎవరిదన్న సమస్య ఉత్పన్నమైంది. అప్పుడు వాళ్ళ అందరి దృష్టికీ బీరడు కన్పించాడు.

తనకు కండబలం, గుండెబలం ఎంత ఉన్నా బీరడు శాసన విరుద్ధమై పనులు చెయ్యాలంటే— ముఖ్యంగా ఇతరుల ధనమాన ప్రాణాలకు హాని కావించాలంటే ఒక అడుగు వెనక్కి తగ్గుతాడు. అంచేత సకలజన సంత్రాస కారకుడైన ఆ రెడ్డి గారిని యమ సదనానికి పంపటానికి సంకోచించాడు. కాని, వాడి దుష్టభూయిష్టమైన కార్య కార్యకలాపాలను కళ్ళారా చూస్తుండడంవల్ల ఎట్టకేలకు ఒప్పుకున్నాడు మోసంచేత చంపటానికి— ఆ రహస్యం ఏనాడూ బయటికి పొక్కనీయకండా ఉండేట్లు ప్రమాణాలుతీసుకున్న తరువాత.

మా ఊర్లో ప్రతియేటా సౌడమ్మదేవతఉత్సవం జరిపే ఆచారం ఉంది. నాడు తదుత్సవాలోకనార్థం వచ్చిన మంత్రాల వల్లారెడ్డిని బీరడు వెనక నుంచి వెళ్ళి అమాంతంగా కంబళితో కప్పి, రెండో కంటికి కనపడకండా ఊరిబయటికి తీసుకువెళ్ళాడు. అంతే మరు రోజునుండి ఆ రెడ్డి చాయకనపడలా.

ఇతరుల సంపదనుచూసి కళ్ళలో కారం పోసుకునే వాళ్ళుకూడా లేకపోలేదు మాఊర్లో. ఈ ప్రకృతి గల కొందరు శిష్టులు బీరడి సుఖజీవనం చూళ్ళేక చాలా నాళ్ళ తరువాత మాటుమణగిన హత్యావిషయాన్ని రహస్యంగా ప్రభుత్వ రక్షణ శాఖ వారి చెవుల్లో వేశారు. న్యాయ విచారణలో బలమైన కారణాలు బయల్పడక పోవటం వల్ల బీరడు ఆరునెలలు శిక్ష ననుభవించి వచ్చాడు.

కడచిన మూడోయేట వర్షర్తువులో బీరడి కాలికి ఒక ముల్లు గ్రుచ్చుకుని చాలా బాధించింది. ముల్లు గ్రుచ్చుకొన్నచోట చెడుగుపుట్టి చివరకు కాలు పనికిరాకండా పోయింది. అప్పట్నుంచీ ఊతకఱ్ఱల సహాయంతో తిరుగుతుంటాడు.

వానికాలు పోయిన్నాటి నుంచే వాడంటే అందరికీ చులకన దృష్టి ఏర్పడింది. వాణ్ణిచూస్తే జడియక పోవడమటుంచి పేచీ పడటానికి తయారు కాసాగారు. ఇది లోకంలో సహజం.

కాలు సరిగా ఉన్నరోజుల్లో బీరడు "వూ" అంటే ఎగిరిపోయే చెత్తవెధవ ఈనాడు వానితో కలహానికి దిగాడంటే—

కలహ స్వరూపం శారీరక బలప్రయోగాలమీద ఆధారపడి ఉండక పోవటంవల్ల వాళ్ళిద్దరి మధ్య జరుగుతున్న వాదనను వింటూ నిలుచున్నాను. బీరడు ఆ ఇంటి జీతగాని భుజంమీద ఉన్న గొంగళిని గట్టిగా కుడిచేత్తో మెలివేసి పట్టుకున్నాడు. వాడేమో పెనుగులాడుతున్నాడు గొంగళి విడిపించుకోటానికి.

"నిన్న నువ్వుతప్ప మా చేన్లోకి ఎవరూరాలేదు. ఆ మోదుగుచెట్టుదగ్గర గడ్డికోసిందికూడా నువ్వే. ఆ చెట్టుదగ్గరున్న గొడ్డలిని నువు కాకపోతే మరెవ్వరు తీస్తారు? తప్పకుండా నువ్వే తెచ్చి ఉంటావు. విడువ్, గొంగళివిడు. గొడ్డలి తెచ్చి ఇచ్చి మరి నీ గొంగడి పట్టుకెళ్ళు." అంటూ చేత్తో ఒడిసి పట్టుకున్న కంబళిని లాక్కోటానికి ప్రయత్నిస్తున్నాడు బీరడు. కాని కాలులేక పోవడం వల్ల, చంకలక్రింద కఱ్ఱలపై సరిగా నిల్చుండలేక తన ప్రయత్నంలో విఫలుడవుతున్నాడు.

"ఇదుగో, నువ్వెంత పెనగులాడినా నేను గొంగడినిమాత్రం వదలను. నేనా చెట్టుదగ్గిర గడ్డి కోయనేలేదు. చేనులో కోసినా. నేను నీగొడ్డలి పట్టుకురాలేదు. నువ్వే ఎక్కడ పడేసుకున్నావో నన్నడుగుతున్నావు. బావుంది వరుస. ఒక్కరోజు చేనులో అడుగు పెట్టానో లేదో అప్పుడే దొంగ తనం అంటగడుతున్నావు. నాకు తెలీదుపో." అని ఖచ్చితంగా చెబుతూ బీరడి చేతినుంచి కంబళిని గింజుగింటున్నాడు జీతగాడు. అప్పుడే దూరంగా నిల్చుని వారి మాటల్ని వింటూన్న నా వైపు చూసి తన కంబళిని బీరడి చేతిలోంచి విడిపించుకోవడం మానివేశాడు. ఏదో యోచన స్ఫురించినట్లుగా మారింది వాని ముఖకవళిక. వెంటనే నావైపు వ్రేలెట్టి చూపుతూ "నేనొక్కడినేనా నిన్న నీ చేలోకి వచ్చింది? నామీద దొంగ తనం మోపుతున్నావు? అదుగో, ఆమె బుచ్చమ్మ కూడా వచ్చింది. ఆమె కాని తీసిందేమో అడుగు. నేను తీయలేదు." అన్నాడు.

వాడి మాటల్లోని అంతర్యాన్ని గమనించాను. తను తప్పుకునేందుకు నేరనేర పంకంలో ఇంకో కర్ని ఇరికించాలనే వాని ప్రయత్నమంతాను. గత దినం గడ్డి కోసుకురావటానికి నేనూ ఆవైపు వెళ్ళిన మాట నిజమే. అయినా, నేను బీరడి చేలో అడుగైనా పెట్టలేదు. అక్కడ పొలం గట్లమీద పెరిగిఉన్న గడ్డిని కోసి మోపు కట్టుకుని వచ్చాను. జీతగాని వాలకం చూస్తే ఆ గొడ్డలిని నిజంగా వాడే దొంగిలించి ఉండవచ్చుననే అనుమానం కలిగింది నాలో. ఐనా ఆ విషయమై నేనేమీ కల్పించుకోలా. బీరడు తన గొడ్డలి నేనేమైనా తీసిఉంటానేమోనని తలంచి నన్నడుగుతాడేమో నని నిశ్చలంగా నిలుచున్నా.

అంతలో వాని మాటలకు బీరడే జవాబు చెప్పాడు· "అవసరం లేకండా ఆమెమీద దొంగ తనం వేస్తావెందుకు? దొంగముండా కొడుక! నేను చూశాను నిన్న ఆ మోదుగుచెట్టుదగ్గర గడ్డి కోస్తుంటే. పాపం! ఆమె మా చేలోకి రానేలేదు. మా పొలానికి చాలా దూరంగా గడ్డి కోసుకు పోయింది. నువ్వే తీశావు గొడ్డలి. విడు. ముండా కొడక!" బీరనికి కోపం ముంచుకొచ్చింది. బలం కొద్దీ ఒక్కసారి లాగాడు కంబళిని. కంబళి జీత గాని చేతిలోంచి జారిపోయింది. దాంతో బీరడి బాహుమూలాల క్రిందినుంచి ఊతకఱ్ఱలు కదిలినై. వాడు నిలుచుండలేక ఒరిగి వెనుక ఉన్న అరుగు మీద పడ్డాడు. అయ్యో అనిపించింది నామనస్సుకి.

కలహ వాదనను నాతోబాటు నిలుచుని వింటూన్నవాళ్లలో ఒకామె ఆ దృశ్యాన్ని చూడ్లేక పోయింది కాబోలు "అయ్యో, అయ్యో" అంటూ ముందుకురికి జీతగాణ్ణి ఉద్దేశించి "ఏమొచ్చిందిరా నీకు? కాలు లేని వాణ్ణి అట్లా త్రోస్తే వాడిగలేం గాను? ఇంత పొగరు పనికిరాదు. గొంగడి వదిత్తే నీదేం పోయింది? నీవు గొడ్డలి తీయలేదని బుజువయితే నీ గొంగడి నీకు తిరిగి వస్తుంది. ఎక్కడికి పోతుంది? విడువరాదా సన్నాసి?" అంటూ కోపంతో పలికింది బీరడికి ఊతకఱ్ఱల నందిస్తూ.

అప్పుడే ఆ యింట్లోంచి యజమానురాలు వచ్చింది. ఆమె ముఖంగూడా కోపంతో ఎఱ్ఱబారి ఉంది. "నువ్వెవ్వరమ్మా మధ్యన తగుదునంటూ వచ్చావు? గొడ్డలి పోగొట్టుకున్న వాడలా ఉండగా న్యాయంచెప్పటానికి సిద్ధమయ్యావు- వాడిచిత్తం, వాడిచిత్తం. నువ్వు నోర్మూసుకూర్చోరాదూ?"

ఆమె మాటలు అసమంజసంగా తోచి "ఎందు కమ్మా పార్వతమ్మా నువ్వంతగా కోప్పడుతున్నావు? అవిటి వానితో అలా గింజుకోవటం బావుండదని చెబితే ఏంపోయింది. ఈ మాత్రం మాట అంటే తప్పా? ఏమో మనిషి కనక మనిషిపట్ల జరిగిన ప్రవర్తనను వారించింది. లేకపోతే..." అని అనకుండా ఉండలేక పోయాన్నేను.

"ఓహో, నువ్వా వచ్చావా సాయపడటానికి. అందరూ సంసారులే; దుడుకు ఎవరో తెలీదు. వాళ్ళూ వాళ్ళూ పెనుగులాడుకుంటూంటే మీరెవరమ్మా మధ్యన? ఇంతకూ నువ్వూ వెళ్ళావటగా నిన్న ఆ చేనువైపు. నువ్వగాని తెచ్చావేమో ఇవ్వరాదూ. ఎవడు చులకనగా కన్పిస్తే వాడి మీదికే విరుచుకు పడుతుంది లోకం." అని చేతులూపుతూ చిర్రున లేచింది నా మీదికి. అనవసరంగా పేచీ పడటం నా కిష్టం లేక పోయింది.

జీతగాణ్ణి లొంగదీయటానికి బీరడి దగ్గర శారీరక బలం కావలసినంత లేదు. మాటలు సరిపోవటంలేదు. ఆఖరుకు బీరడు జీతగాణ్ణి సంబోధించి అన్నాడు—"అరే. తీయలేదంటున్నావు కదా, సరే. అయితే ప్రమాణంచేసి చెప్పు, విడిచిపెడ్తా. వెధవ గొడ్డలి. పోతే పోనీ—"

బీరడి మాటలు పూర్తవక ముందే "నిజంగా నేను గొడ్డలి తీయలేదు. ప్రమాణంచేసి చెబుతున్నా" అన్నాడు జీతగాడు.

"ఊరికే నోటితో అని ప్రమాణం చేస్తే సరిపోదు. పద. పోదాం. హనుమంతు నెత్తిగొట్టి చెప్పుదువు పద." అన్నాడు బీరడు వాణ్ణి చెయిబట్టి లాగుతూ.

వాడు గొంగడి భుజాన వేసుకుని బీరనివెంట నడవటానికి ఉద్యుక్తుడయ్యాడు. బీరడు మళ్ళీ అన్నాడు, "నువ్వు మాత్రమే వస్తే ఎట్లాగు? ఇంటికెళ్ళి నీ కొడుకునెత్తుకుని రా, పో."

మాఊర్లో పూర్వంనుంచీ వస్తున్న ఆచారం ఒకటుంది. ఎవడేగాని అన్యాయం నడత నడచిన వాడు తనమీదినేరం నిజం కాదని ఋజువు చేసుకోవాలంటే తన కొడుకునుగానీ, తన భార్యనుగాని ఎత్తుకుని నిజంగా తానా నేరం చెయ్యలేదని అంటూ ఊరి బయటఉన్న హనుమంతుని శిలావిగ్రహం నెత్తిన చెయిఉంచాలి. అది ప్రమాణం. అన్యాయ ప్రవర్తన కలవాడలాచేస్తే వాడి వంశం నశించి పోతుందని చాలా నాళ్ళనుంచి వస్తూన్న నమ్మకం.

తన కొడుకుపేరు వినేసరికి అదిరిపడ్డాడు జీతగాడు. "ఇదుగో, నన్నురమ్మంటే వచ్చి నీకు కావాల్సిన ప్రమాణం చేస్తాను. కాని నాకొడుకు నెత్తుకు రమ్మంటే మాత్రం చచ్చినారాను. నీఇష్టం, వెళ్ళి ఎవరితోనైనా ఫిర్యాదు చెప్పుకో." ఈ మాటలంటూ ఆగిపోయాడు వాడు.

ఎక్కువ మాటలవల్ల లాభం కన్పించక పోయేసరికి బీరడు "సరే, నువ్వేపద ప్రమాణం చేద్దువుగాని." అన్నాడు.

జీతగాడు 'సరే' నంటూ బీరడిని వెంబడించాడు. వెనకనుంచి యజమానురాలు పిలిచింది: "ఓరి బాలిగా! (అది వానిపేరు) ఎక్కడికి పోతున్నావ్? ఇంట్లో ఒక్క నీటిబొట్టయినాలేదు. నీళ్ళు తెచ్చి మరి వెళ్లు" అంది.

బాలిగాడు ఆగాడు: "ఇంట్లోకి నీళ్ళు తోడి పోసి వస్తాను." అంటూ. ఆమె ఎందుకు పిలిచిందో అక్కడున్న వాళ్ళకు అవగతం కావటానికి క్షణం పట్టలేదు.

"వాణ్ణి పోనివ్వమ్మా ప్రమాణంచేసి మరీ వస్తాడు." అంది అక్కడ నిల్చున్న వాళ్ళలో ఒకామె.

"అంత పట్టుదల కలదానివి నువ్వువచ్చి నీళ్ళు తోడి పొయ్యరాదూ ఇంట్లోకి?" అని కోప్పడింది పార్వతమ్మ....

కొన్నాళ్ళ తరువాత పార్వతమ్మ మా ఇంటికొచ్చి "బుచ్చమ్మా, కాస్త గొడ్డలివ్వమ్మా. మా ఆయనా, జీతగాడు ఇవాళ కట్టెలు కొట్టుకు రావటానికి బండి కట్టుకు వెడుతున్నారు అడవికి. తిరిగి రేపు తెచ్చిఇస్తాము." అని అడిగింది.

నేను గొడ్డలి ఇచ్చాను "మళ్ళీ మరువకండా తెచ్చివ్వమ్మా" అని మామూలుగా చెబుతూ.

మరుసటి రోజు అవసరమొచ్చి వాళ్ళింటికి వెళ్ళాను మా గొడ్డలి తిరిగి తెచ్చుకోడానికి. ఆమె అదో మాదిరి ముఖం పెట్టి "అయ్యో, బుచ్చమ్మక్కా మీ గొడ్డలి నిన్న మా ఆయన అడవిలో ఎక్కడో మరచివచ్చాడట. ఎట్లాగమ్మా? ఈ సారికి మా గొడ్డలి తీసికెళ్ళి పని జరుపుకోండి.

వచ్చే ఆదివారం సంతరోజున మరో గొడ్డలి కొని ఇస్తాం మరేమీ అనుకోకమ్మా" అంది.

ఆమె అంతగా ప్రాథేయపడుతుంటే నాకేమీ అనటానికి మనసొప్పలా. అలాగే నంటూ వాళ్ళ గొడ్డలి తీసుకొచ్చి, అవసరం తీరాక తిరిగి తీసుకు వెళ్ళి ఇచ్చాను. "తప్పకండా సంతరోజున కొని తెచ్చివ్వమ్మా గొడ్డలి" అని చెబుతూ ఇంటికి వస్తూంటే—"ఎంతమాట. తప్పకండా కొనిస్తానక్కా. నా కామాత్రం జ్ఞాపకముండదూ!" అని ఆమె అంటూన్న మాటలు నా కర్ణేంద్రియాల్లో ఒక్కటొక్కటే వచ్చి దూరినయి.

ఆదివారం నాటి అంగట్లో కొందేమో గొడ్డలిని పార్వతమ్మ సోమవారంనాడు "ఇదుగోనమ్మా." అంటూ ముట్టచెప్పింది.

ఒకనాడు ఉదయం వంటింట్లో కూచుని అంబలి కాస్తూంటే బయటినుంచి—"ఏమేవ్" అని మా ఆయన గొంతు విన్పడింది.

"ఏమిటి?" అడిగాను ఇంట్లోంచే.

"ఇటురా." అన్నాడాయన.

నేను బయటికి వెళ్ళాను. మా ఆయన చేతిలో గొడ్డలి పట్టుకుని ఉన్నాడు. అక్కడే బీరడు కూడా నిలబడి నాకేసి చూస్తున్నాడు. వాడి మొహంలో క్రోధం, అసహ్యం ప్రస్ఫుటమవుతున్నయి.

"ఈ గొడ్డలి బీరడిదట. మనింట్లో కెలావచ్చింది? ఆనాడు వీని పొలం వైపు గడ్డికోరకు వెళ్ళావట. నువ్వుగాని తీసుకొచ్చావా?" అని ఉరిమాడాయన.

నాకేమీ అర్థం కాలేదు. అంతా అయోమయంగా తోచింది. ధైర్యం చిక్కబట్టుకుని చెప్పాను. "కాదు, ఈ గొడ్డలి నేను తీసుకు రాలేదు. మన గొడ్డలి పార్వతమ్మ తీసికెళ్ళి పోగొట్టి అంగట్లో ఈ గొడ్డలి మనకు కొని ఇచ్చింది.' అన్నాను.

"ఎందుకమ్మా అబద్ధమాడుతావ్. ఈ గొడ్డలి నిజంగా నాదే. నా చేతిలో దీన్ని చూసిన వారెందరో ఉన్నారు. కావలిస్తే సాక్ష్యం పలికిస్తా అదుగో దాని నెత్తిమీద సితారు కూడ వేయించాను." అంటూ గొడ్డలిమీద అలంకారానికై చెక్కిన చినచిన్న రంధ్రాలు చూపాడు.

నాకేమీ పాలుపోలా. ఏం చెయ్యాలో స్ఫురించలా. మా ఆయన ముఖాన్ని చూశాను. నామీద చేయి చేసుకుంటాడనిపించింది. "అయితే కావచ్చు. పార్వతమ్మను పలికిస్తా పద, ఈ గొడ్డలి ఆమె ఇచ్చిందో కాదో? భగవంతుడిమీద ఒట్టేసి చెబుతున్నా, నేను మాత్రం తేలేదు." అని అంటూ పార్వతమ్మ ఇంటికడకు వెళ్ళాను. గొడ్డలితో మా ఆయనా, బీరడూ నన్ను వెంబడించారు.

"ఏమమ్మా, పార్వతమ్మా? ఈ గొడ్డలి నీవట కొనివ్వలేదూ!" అని మా ఆయన చేతిలోని గొడ్డలి తీసుకుని ఆమెకు చూపిస్తే—పార్వతమ్మ దానిని అటూ ఇటూ త్రిప్పి, పరకాయించి చూసి "ఎబ్బే. కాదే! నేను కొనిచ్చిన గొడ్డలి ఇదికాదు." అంది.

ఏం సమాధానం చెప్పాలో నాకు బోధపడలా. గొడ్డలిని మరోసారి చూశాను. నాకు బాగా జ్ఞాపకముంది. పార్వతమ్మ తెచ్చిఇచ్చినదా గొడ్డలే. పార్వతమ్మకేసి చూశాను దీనంగా. ఆమె అమాయకపు పోజు పెట్టి నిల్చునివుంది.

మా ఆయన అసహ్యంతో "ఛీ, ఈ నాటికి ఈ బ్రతుకులో ఒక గొడ్డలి—ఇనుపముక్క దొంగతనం... ముదనష్టపు ముండ! ఫూ!" అని ప్రక్కకు ఉమిసి కోపంతో చరాచరా వెళ్ళిపోయాడు.

నేనక్కడే నిల్చున్నా, అపవాదు నెత్తిన మోసినందుకు నా కడుపులోంచి దొంతరలు దొంతరలుగా వస్తూన్న దుఃఖం కళ్ళలో అశ్రువుల రూపంగా జారి క్రిందపడుతూంది.

"పాపం! ఆనాడు అనవసరంగా పార్వతమ్మను, ఆమె జీతగాణ్ణి అనుమానించాను, అసలు రహస్యం ఇక్కడే ఉంచుకుని నమ్మినందుకు మంచిపని చేశావమ్మా ఇటివ్వు." అంటూ నా చేతిలోని గొడ్డలి లాక్కుని వెళ్ళిపోయాడు. పోతూపోతూ "హుఁ, ఒక్కొక్కప్పుడు అమాయకుల మీదనే నేరాలు పడతాయి లోకంలో" అని సణిగాడు.

గొడ్డలి పోతేపోయింది. కాని భరింప శక్యంగాని అపవాదు నెత్తిన పడింది. బీరడి దృష్టిలో నేను దొంగతనం చేసినదాన్ని. బరువైన గుండెతో ఇంటికి వస్తున్నా. బీరడు అన్న ఆఖరు మాట నిజమే, కాని అదేమాట వాని అభిప్రాయంతో పోల్చిచూస్తే...

★